**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

# ప్రాంతీయ వార్తలు

తేదీ:  02-01-2026                                    సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- భూసమస్యల పరిష్కారానికి రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తున్నామని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.
- కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.
- మచిలీపట్నం పోర్టు ఏడాదిలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.
- ప్రభుత్వ పెన్షనర్లు తమ జీవన ప్రమాణ పత్రాలను ఫిబ్రవరి 28 లోగా సమర్పించాలని అనకాపల్లి జిల్లా ఖజానా, గణాంక అధికారిణి వి.ఎల్. సుభాషిణి కోరారు.

=====================

రైతుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం వెల్లటూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి ఆయన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారానికి రీ-సర్వే చేపట్టి రైతులకు రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ లు ఏర్పాటు చేశామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…33 సెకన్లు)

=====================

కూటమి ప్రభుత్వం అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం జిల్లా సాలూరులో రైతులకు నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి  మాట్లాడుతూ... భూమిపై రైతుకు పూర్తి హక్కు కల్పిస్తూ, వివాదాలకు తావులేకుండా పారదర్శకమైన రికార్డులను అందించడమే ఈ నూతన పాస్ పుస్తకాల లక్ష్యమని అన్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న పాస్ పుస్తకాలను అధునాతన సాంకేతికతతో రూపొందించారన్నారు. ఇందులో భూమి విస్తీర్ణం, మ్యాప్, భద్రత కోసం క్యూఆర్ కోడ్ (QR Code) వంటి ప్రత్యేకతలు ఉన్నాయని చెప్పారు. మహిళా సాధికారత, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు రాష్ట్రంలోని మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మెగా డీఎస్సీ పేరుతో 16 వేల 500 ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.

=====================

మచిలీపట్నం పోర్టు ఏడాదిలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈరోజు కృష్ణా జిల్లాలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరితో కలిసి మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... పోర్టు అనుసంధాన రహదారులకై 400 కోట్ల రూపాయలతో  రైల్వే లైన్ కు సమాంతరంగా సముద్ర తీర

ప్రాంతంలో రెండు వరుసల రహదారి నిర్మాణం చేసేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ జాతీయ రహదారిని 6 లైన్లుగా విస్తరించాలని తమ ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీనికోసం 2 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతాయని వివరించారు. తీర ప్రాంతాలను కలుపుతూ హైవే నిర్మాణం చేస్తే ఆయా గ్రామాల్లో కూడా అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కంకిపాడు నుంచి గుడివాడ వరకు గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేశామని వెల్లడించారు.

====================

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ జీవన ప్రమాణ పత్రాలను ఫిబ్రవరి 28 లోగా సమర్పించాలని అనకాపల్లి జిల్లా ఖజానా, గణాంక అధికారిణి వి.ఎల్. సుభాషిణి ఈరోజు ఒక ప్రకటనలో కోరారు. అయితే.. అనారోగ్య కారణాలతో కార్యాలయాలకు రాలేని పెన్షనర్లు సంబంధిత ఖజానా అధికారులకు సమాచారం అందిస్తే, అధికారులు స్వయంగా వచ్చి జీవన ప్రమాణ పత్రాలను నమోదు చేస్తారని ఆమె తెలిపారు. బయోమెట్రిక్ సమస్యలు ఎదుర్కొంటున్న పెన్షనర్లు నేరుగా సంబంధిత ఖజానా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని వివరించారు.

====================

విరామం

====================

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో 2025 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో భారతదేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం..

2025 సంవత్సరం భారత శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఒక గొప్ప మలుపుగా నిలిచింది. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, అంతరిక్ష పరిశోధన, అణుశక్తి వంటి రంగాల్లో భారత్, ప్రపంచ స్థాయిలో తన ప్రభావాన్ని స్పష్టంగా చూపించింది. ఇండియా ఏఐ మిషన్ కింద 10 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులతో దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక వసతులు విస్తరించగా, 38 వేల జీపీయుల జాతీయ కంప్యూట్ సామర్థ్యం అందుబాటులోకి వచ్చింది. స్టాన్ఫర్డ్ యూనివర్సిటీ 2025 గ్లోబల్ ఏఐ ర్యాంకింగ్స్ లో భారత్ మూడో స్థానంలో నిలవడం విశేషం. జాతీయ కీలక ఖనిజాల మిషన్ ద్వారా అరుదైన లోహాలపై విదేశీ ఆధారాన్ని తగ్గించే దిశగా చర్యలు చేపట్టారు. అంతరిక్ష రంగంలో నిసార్ ఉపగ్రహ ప్రయోగం, తొలి భారతీయ వ్యోమగామి ఐఎస్ఎస్ ప్రయాణం దేశ ప్రతిష్టను పెంచాయి. అణుశక్తి , శాస్త్రీయ పాలనలో నిర్మాణాత్మక సంస్కరణలు కూడా చోటు చేసుకున్నాయి. సస్టైనబుల్ హార్నెస్సింగ్ అండ్ అడ్వాన్స్మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్ఫార్మింగ్ ఇండియా-శాంతి అని పిలువబడే అణుశక్తి బిల్లు-2025ను గత సంవత్సరం కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ఇవన్నీ కలిసి 2025ను భారత సాంకేతిక స్వావలంబనకు మైలురాయిగా నిలిపాయి.

====================

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను ఈ నెల 8వ తేదీ వరకు పూర్తిగా సర్వదర్శనానికి అనుమతిస్తున్నామని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లను ఈరోజు ఆయన అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు, ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసిందని వెంకయ్య చౌదరి తెలియజేస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

====================

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ రామ్ జీ)గా మార్చడాన్ని శ్రీకాకుళం జిల్లా వాసులు స్వాగతిస్తున్నారు. ఈ పథకంలోని పని దినాలు 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ కుటుంబాలు వలసలు వెళ్ళకుండా ఉండేందుకు ఈ పథకం ఎంతో మేలు చేకూరుతుందని అంటున్నారు. పని దినాలు పెంచడం ద్వారా ఆర్థికంగా లబ్ధి పొందుతామని శ్రీకాకుళం జిల్లా సింగుపురం గ్రామానికి చెందిన కళ్యాణి తెలియజేస్తూ...

(వాయిస్…25 సెకన్లు)

====================

గుంటూరులో నిర్మితమవుతున్న శంకర్ విల్లాస్ బ్రిడ్జ్ పనులు నిర్ణీత కాలవ్యవధిలోనే పూర్తవుతాయని కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ఈరోజు ఆయా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైల్వే అనుమతులు లేకుండా పనులు జరిగాయన్న ఆరోపణల్లో వాస్తవం లేదని, రైల్వే అధికారులతో పలు  సార్లు సమావేశమై, అనుమతులు పొందామని వివరించారు.

=====================
=====================